పేకాట రాయుళ్ల అరెస్టు

రామచంద్రాపురం, మార్చి 26: ఆర్సీపురం డివిజన్‌లోని రామచంద్రారెడ్డినగర్‌లో ఎస్‌వోటీ పోలీసులు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఆర్‌ఆర్‌నగర్ కాలనీకి చెందిన పలువురు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆర్సీపురం పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా పేకాట స్థావరంపై దాడులు చేసి 15మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.66,090వేలతోపాటు 15 సెల్‌ఫోన్లు, 4సెట్ల కార్డ్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్‌ఆర్‌నగర్‌లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ పేకాట రాయుళ్లకు అడ్డాగా మారడంతో కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతులు బాగుంటేనే దేశం బాగుంటది
- ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలి
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

అకాల వర్షాలకు నేలకొరిగిన జొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెలే మాణిక్‌రావు

ఝరాసంగం, మార్చి 26 : రైతులు బాగుంటేనే దేశం బాగుంటదని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నేలకొరిగిన జొన్న పంటను ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదిక అందించాలన్నారు. పంటలు దెబ్బతిని వారంరోజులు గడిచినప్పటికీ అధికారులు, ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు గడిచినా ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అనంతరం కుప్పానగర్‌లో రేణుకాఎల్లమ్మ ఆలయ 30వ వార్షికోత్సంలో పాల్గొని అమ్మవారికి అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్ శంకరయ్య, నాయకులు బొగ్గుల సంఘమేశ్, నర్సింహులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి



కర్చల్ రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రాయికోడ్, మార్చి 26: మండలంలోని కర్చల్ గ్రామంలో నుతనంగా నిర్మించిన ఆలయంలో రేణుకాఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మంగళవారం స్థాపిత దేవతాపూజ, జలాదివాసం, సప్తానం, చండీ హోమం, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను ఆలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిడిని అధిగమించడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఉత్సవాలతో ఐకమత్యం వెల్లివిరియడంతోపాటు స్నేహంభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజుపాటిల్, మండల జైగౌడ సంఘం అధ్యక్షుడు బాబాగౌడ్, మాజీ సర్పంచ్‌లు బాబుకుమార్, శ్రీనివాస్ రెడ్డి, సంగమేశ్వర్ పాటిల్, చంద్రశేఖర్, వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శివశంకర్, అంజి, హనుమంతు, ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గౌడ్, సంగమేశ్వర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, విష్ణుగౌడ్, గాజుల పణిరాజు ఉన్నారు.

డ్రగ్స్ తయారీ అడ్డాలుగా పారిశ్రామిక వాడలు

- పటాన్‌చెరు, పాశమైలారం, ఐడీఏ బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి, అనంతారం
- పారిశ్రామిక వాడల్లో మూతబడిన పరిశ్రమలే తయారీ కేంద్రాలు
- ఇక్కడ తయారు చేసిన డ్రగ్స్ దేశ, విదేశాలకు సరఫరా
- అధికారుల నిఘా కరువు

ఐడీఏబొల్లారం పారిశ్రామిక వాడలో డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు(ఫైల్)

జిన్నారం, మార్చి 26 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతాలు నిషేధిత మత్తుమందుల తయారీకి అడ్డాలుగా మారుతున్నాయి. ఇక్కడ తయారు చేసి దేశ, విదేశాలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు ఇటీవల పట్టుబడిన ఘటనలు నిజం చేశాయి. రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలన్న దురాశతో ప్రభుత్వం నిషేధించిన మత్తు మందులను తయారు చేస్తున్నారు. ఇందుకోసం ఎక్కువగా మూతబడిన పరిశ్రమలు, సిక్ పరిశ్రమలను ఎంచుకుంటున్నారు. ఇలాంటి పరిశ్రమలపై ఎవరి దృష్టి ఉండకపోవడంతో డ్రగ్స్ తయారీకి సిద్ధపడుతున్నారు. పైగా ఇందులో ఎలాంటి ఉత్పత్తులు చేస్తున్నారో కూడా రసాయన నిపుణులకు, సంబంధిత శాఖ అధికారులకు తప్ప సామాన్య జనాలకు, పనిచేసే కార్మికులకు తెలియదు. ఇదే డ్రగ్స్ తయారీదారులకు కలిసివస్తున్న అంశం. పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీ చేస్తూ పట్టుబడిన ఘటనలు ఉన్నాయి.

మూతబడిన పరిశ్రమలే అడ్డాలు

మూతబడిన పరిశ్రమలు, సిక్ ఇండస్ట్రిస్ డ్రగ్స్ తయారీకి అడ్డాగా మారాయి. వీటికి రోడ్లు సరిగ్గా ఉండవు. భయంకరమైన వాతావరణంలో పరిశ్రమలు ఉంటాయి. ఇప్పటివరకు అధికారుల దాడులు చేసిన పరిశ్రమలన్నీ మూతబడిన, సిక్ పరిశ్రమలే. గతంలో పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో ఇలాంటి సిక్, మూతబడిన పరిశ్రమల్లో నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేయగా అధికారులు దాడులు చేశారు. అక్రమంగా మత్తు మందులు తయారు చేస్తున్న పరిశ్రమలకు ఎలాంటి పేరు, వివరాలు ఉండడం లేదు. సంవత్సరకాలంలో అధికారులు దాడులు చేసిన ఆరు పరిశ్రమల్లో మూడు పరిశ్రమలకు బోర్డు లేదు, పేరు, వివరాలు లేవు.

తయారీదారులంతా అక్కడ పనిచేసిన వారే..

డ్రగ్స్ తయారు చేస్తూ పట్టుబడిన వారంతా గతంలో రసాయన పరిశ్రమల్లో పనులు చేసిన వారే. డ్రగ్స్ తయారు చేస్తున్న వారికి స్థానికంగా కొందరి నుంచి సహకారం లభిస్తోంది. ఎలాంటి సహకారం లేకుంటే రాష్ట్రస్థాయిలో కుదిపేసే ఇలాంటి డ్రగ్స్ తయారీకి ఎవరు సాహసం చేయరని నిపుణులు అంటున్నారు. బొల్లారంలో 2016 సెప్టెంబర్‌లో జరిగిన డ్రగ్స్ తయారీలో దొరికిన వారు ఇంతకు ముందు ఓ పరిశ్రమలో కెమిస్ట్‌గా పని చేసిన వ్యక్తే. అలాగే 2017లో బొల్లారంలో అధికారులు దాడులు చేసి పట్టుకున్న డ్రగ్స్ తయారీలో ముఖ్య పాత్ర పోషించిన వ్యక్తి గతంలో గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో కెమిస్ట్‌గా పనిచేసిన వ్యక్తి. వివిధ పరిశ్రమల్లో కెమిస్ట్‌గా పనిచేసిన వారు డబ్బుమీద అధిక వ్యామోహంతో రాత్రికి రాత్రే కోటీశ్వర్లు కావాలన్న దురాశతో ప్రభుత్వం నిషేధించిన డ్రగ్స్‌ను తయారు చేస్తూ అధికారులకు పట్టుబడుతున్నారు. ఇందుకోసం మూసిఉన్న పరిశ్రమలను లీజుకు తీసుకుంటున్నారు. యాజమానులకు ఒకటి చెప్పి ఉత్పత్తులు మరొకటి చేస్తున్నారు.

డ్రగ్స్ తయారీ ఘటనలు

పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లో నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తూ తెలంగాణ యాంటీ నార్కోటిక్ టీమ్, స్థానిక పోలీసులకు పట్టుబడిన ఘనలు అనేకం ఉన్నాయి. 2016 అక్టోబర్ 4న ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేసి తరలిస్తుండగా సెంట్రల్ టాస్క్ ఫోర్స్ అధికారులు బెంగళూరులో దాడిచేసి పట్టుకున్నారు. అప్పట్లో ఈ ఘటన పెద్ద సంచలనంగా మారింది. అధికారులు దాడుల్లో పట్టుకున్న డ్రగ్స్ విలువ రూ.42కోట్లు. అదే సంవత్సరం డిసెంబర్ 7న పటాన్‌చెరు మండలం గండిగూడెం సమీపంలోని వార్డే పరిశ్రమలో అక్రమంగా డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 149 కిలోల ఆల్ఫోజోమ్‌ను స్వాదీనం చేసుకున్నారు. దాని విలువ మార్కెట్‌లో రూ.80లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. డిసెంబర్ 23న గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామ శివారులోని వెంకటరాఘవ ల్యాబ్ పరిశ్రమలో నిషేధిత ఆల్ఫోజోమ్ మత్తు మందును తయారు చేస్తుండగా రెవెన్యూ నిఘావిభాగం దాడులు చేసి 132 కిలోల మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ మార్కెట్‌లో రూ.3కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. ఐడీఏబొల్లారంలోని ఓ సిక్ ఇండస్ట్రిస్‌లో నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తుండగా రెవెన్యూ నిఘావిభాగం అధికారులు దాడులు చేసి 179 కిలోల మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.5కోట్లకు పైగానే ఉంటుంది. గతంలో గడ్డపోతారం పారిశ్రామివాడలో ట్రెకడాల్ అనే మత్తు పదార్థాన్ని తయారు చేసి పాకిస్తాన్‌కు పంపించే క్రమంలో యాంటీ నార్కోటిక్ టీమ్ గుర్తించి పట్టుకున్నారు. 2023 డిసెంబర్‌లో కొడకంచి శివారులోని జామతోటలో గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తుండగా 14 కిలోల నార్డాజెపం అనే మత్తు మందును అధికారులు పట్టుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.3కోట్లు ఉంటుందని వెల్లడించారు. ఈనెల 21న ఐడీఏబొల్లారం పారిశ్రామిక వాడలోని పీఎస్ఎన్ మెడికేర్ పరిశ్రమలో 90 కిలోల మెపిడ్రిన్ డ్రగ్‌ను అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. దీని విలువ రూ.9కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఘటన మరువకముందే ఈనెల 23న ఐడీఏ బొల్లారంలోని మెడికేమ్ పరిశ్రమలో 2.84కిలోల ఎంఎంసీ(మిథైల్ మెథ్ కాతినోస్) అనే డ్రగ్‌ను అధికారులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.10లక్షలు. ఇవి కేవలం బయటపడినవి మాత్రమే.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో పాండు

అందోల్, మార్చి 26: 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అందోల్-జోగిపేట ఆర్డీవో పాండు అన్నారు. మంగళవారం ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో 5కే రన్ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి అన్నాసాగర్ వరకు నిర్వహించిన 5కే రన్‌లో పలు కళాశాలల విద్యార్థులు, అధికారులు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ యువత ఓటుతో సరైన నాయకత్వాన్ని ఎన్నుకుంటే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హత్నూర, మార్చి 26: మండలంలోని గోవిందరాజ్‌పల్లిలో కొనసాగుతున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ మంగళవారం ముగిసింది. టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొనగా రాంసాన్‌పల్లి టీం ప్రథమ, బద్రిగూడెం టీం ద్వితీయస్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేల నగదుతోపాటు ట్రోఫీలను మాజీ సర్పంచ్ సునీతారాజు విజేతలకు అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు వీరేశం, అర్జున్, పురుషోత్తం, అరుణ్, నాయకులు కృష్ణ, గౌరేశ్, కోటేశ్వర్, దశరథ పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

తహసీల్దార్ రాజిరెడ్డి ఎదుట పాత నేరస్తులను బైండోవర్ చేసిన హద్నూర్ పోలీసులు

న్యాల్‌కల్, మార్చి 26: ఎన్నికల నియమావళిలో భాగంగా మంగళవారం మండలంలోని పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన 12 మంది పాతనేరస్తులను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈమేరకు న్యాల్‌కల్ తహసీల్దార్ రాజిరెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్టు పేర్కొన్నారు. అనంతరం ఎస్ఐ రామానాయుడు మాట్లాడుతూ పాతనేరస్తుల్లో సత్ప్రవర్తన కోసం తహసీల్దార్ ఎదుట హాజరు పర్చామన్నారు. పాతనేరస్తులపై నిరంతరం నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోహీర్, మార్చి 26: జహీరాబాద్ మండలంలోని తుంకుంట అటవీ ప్రాంతంలో మంగళవారం గుర్తు తెలియని శవం లభించిందని జహీరాబాద్ రూరల్ ఎస్సై ప్రసాద్‌రావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. తుంకుంట శివారులోని అటవీ ప్రాంతంలో అటవీశాఖ బీట్ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో చెట్ల పొదలను తొలిగిస్తుండగా అస్థిపంజరం కనిపించింది. అతడి వయసు 60నుంచి 65 వరకు ఉంటుంది. అతడి ఆచూకీ తెలియ లేదు. దీంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. వృద్ధుడి అనుమానాద మృతిపై తుంకుంట బీట్ అధికారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల సలహాలు పాటించాలి

రైతులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కొండాపూర్, మార్చి 26: కొండాపూర్‌లోని రైతువేదికలో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావుతోసహా రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు సాగు విధానాలపై అవగాహన కల్పించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సమగ్ర వ్యవసాయంలో పాడి యాజమాన్యం, గొర్రెలు, కోళ్లు చేపల పెంపకంపై వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ గోవర్ధన్ తెలియజేశారు. డ్రోన్లతో నేరుగా విత్తడం, పురుగు మందులు, పోషకాల పిచికారీ, డ్రోన్ పైలట్ శిక్షణ ఎక్కడ పొందాలి అనే వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్ఎస్‌వో శ్రీధర్, ఏడీఏ మనోహర, ఏవో ప్రతిభ, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిజాంపేట్, మార్చి 26: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం నిజాంపేట్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..నిజాంపేట్ 161 జాతీయ రహదారిపై డీసీఎం వాహనంలో హార్వెస్టర్ యంత్రాన్ని తరలిస్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో అదుపు తప్పి బాచేపల్లి గ్రామ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం వెనుక నిద్రిస్తున్న హార్వెస్టర్ డ్రైవర్ కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన రాజాసాహెబ్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

ఎంపీపీ ఆర్థిక సాయం

జిన్నారం, మార్చి 26: జిన్నారం గ్రామానికి చెందిన శినంగారం నర్సమ్మ, ఈదిగాని భూమిక ఇటీవల మృతి చెందారు. కోరబోయిన నరేశ్, నరేందర్‌గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న ఎంపీపీ రవీందర్ గౌడ్ రెండు కుటుంబాలకు రూ.5వేల చొప్పున స్థానిక నాయకుల ద్వారా మంగళవారం ఆర్థికసాయం అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

భామనకుంటలో అక్రమ నిర్మాణాలు

బామన కుంట పైభాగంలో చేపట్టిన నిర్మాణం

జిన్నారం, మార్చి 26: గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్ పరిధిలోని సర్వేనంబర్ 27కు ఆనుకొని ఉన్న భామనకుంట పైభాగంలో చేపట్టిన నిర్మాణాలను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. నిర్మాణం చేపట్టిన స్థలం భామనకుంట పరిధిలోనిదని, ఇక్కడ ఎలా నిర్మాణాలు చేస్తారని గ్రామస్తులు ప్రశ్నించారు. నిర్మాణానికి అనుమతులు ఎవరిచ్చారని ప్రశ్నించారు. దీనికి సంబంధిత వ్యక్తులు సరైన సమాధానాలు చెప్పకపోగా, నిర్లక్ష్యంగా మాట్లాడడంతో టీఎస్ఐఐసీ కార్యాలయంలో, ఆర్ఐ, సర్వేయర్‌లకు ఫిర్యాదు చేశారు. నిర్మాణం చేపట్టి గాలి పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిని మూసేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

అందోల్, మార్చి 26: అందోల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కొద్దిరోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడని మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేయడంతో ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. కళాశాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగినిని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కొద్దిరోజులుగా లైంగికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, తనను అందరిలో అవమానపరుస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. కళాశాలకెళ్లి వివరాలు సేకరించామని, పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

విగ్రహాల ఊరేగింపు

వీరభద్రేశ్వర స్వామి విగ్రహాన్ని ఊరేగిన్న భక్తులు

న్యాల్‌కల్, మార్చి 26: హద్నూర్ గ్రామంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలోని దత్తగిరి ఆశ్రమం నుంచి ప్రధాన రోడ్డు గుండా స్వామివారి విగ్రహాలను భాజాభజంత్రీల హోరు, దండకాలు వేస్తూ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణంలో విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయంలో స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి, అభిషేకం, హారతి, హోమలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

మనూరు, మార్చి 26: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన మనూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని బోరంచలో మంగళవారం బైండ్ల ప్రశాంత్(26) షాపులో ఉన్న ఫ్రిజ్‌లో వస్తువులు తీయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో షాక్ తగిలింది. దీంతో స్థానికులు అతడిని దవాఖానకు తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

బీబీపాటిల్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయుడు

న్యాల్‌కల్, మార్చి 26: జహీరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అసెంబ్లీ ప్రభారీ శ్రీనివాస్ నాయుడు అన్నారు. మంగళవారం ప్రచారంలో భాగంగా మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమైయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీబీపాటిల్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాస్ నాయుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీధర్, రాహుల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ ఎదుట ఆందోళన

హత్నూర, మార్చి 26: కంది మండలం ఆరుట్ల శివారులోని కంకర క్రషర్ ఎదుట మంగళవారం హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. సోమవారం రాత్రి క్రషర్‌కు చెందిన టిప్పర్ ఢీకొనడంతో గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన మొండి కృష్ణ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం కోసం చేపట్టిన ఆందోళనకు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపి యాజమాన్యాన్ని నిలదీశారు. దీంతో క్రషర్ యాజమాన్యం ఆర్థికసాయం అందజేస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు.

నిబంధనలు పాటించాలి

కోహీర్, మార్చి 26: ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం కోహీర్ పట్టణంలోని కిసాన్ ఫర్టిలైజర్, గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

భారీగా ఎగిసిపడిన మంటలు

పటాన్‌చెరు, మార్చి 26: పాశమైలారం పారిశ్రామికవాడలోని ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించి భారీగా ఆస్తినష్టం జరిగింది. బీడీఎల్ సీఐ రవీందర్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసే ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెట్ పరిశ్రమలో మంగళవారం అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఉధృతంగా ఎగసి పరిశ్రమంతా వ్యాపించాయి. పరిశ్రమలో ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో తక్షణం పటాన్‌చెరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. సమాచారం మేరకు వచ్చిన పటాన్‌చెరు, పాశమైలారం ఐలా ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. కార్మికులు సురక్షితంగా ఉన్నారు. ప్రమాదంలో భారీగా సామగ్రి కాలిపోయింది. ఎంత ఆస్తినష్టం సంభవించిందో పరిశ్రమ యాజమాన్యం స్పష్టం చేయలేదు. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.